'అక్కడే నాకు అర్థం కావడం లేదండి-'

'ఏమిటి అర్థం కావడంలేదు?'

'వేట వేటంటాడు-ఇక్కడ ఏం వేటాడతాడని నా మొహం?'

'......శేషయ్యా!'

'ప్రభూ! గాభరాపడకండి-ఏం వేటాడతాడని?'

'మన సంస్థానంలో పులులూ సింహాలూ లేవు'

'అడివి పందులూ, తోడేళ్లూ లేవు-'

'దుప్పులూ లేళ్ళూ లేవు-'

'ఎలకలూ చుంచులూ లేవు-'

'శేషయ్యా! అంతా అయోమయంగావుంది. అభాసుపడేట్టున్నాము. ఏమీ లేకపోతే ఏం వేటాడతాడు? ఆశాభంగం చెంది-?'

'ప్రభూ! నాక్కొంచం అర్థమవుతూంది-'

'అర్థమవుతూందా? శేషయ్యా! చెప్పు చెప్పు! ఏమేనా వున్నాయా ఇక్కడ వేటాడ్డానికి?'

'ఉన్నాయండి-మీకింకా అర్థమవటంలేదూ?'

'ఏమిటది? త్వరగా చెప్పు శేషయ్యా-?'

'మనల్ని వేటాడతాడండి-వార్ ఫండు కోసం!'

## ప్రభువారి దివ్యచిత్తం

'శేషయ్యా?'

'ప్రభూ!'

'ఏమీ ఊసుపోవడం లేదోయ్ ఈమధ్య-'

'చిత్తం! ఒకో అప్పుడు అలాగే వుంటుందండి.'

'ప్రపంచమంతా ఆద్యంతాలు లేని తుమ్మల బీడులా, తెలుకుల గానుక్కి సంబంధింపబడిన ఎద్దుయొక్క గుడ్డిపరిభ్రమణంలా కనిపిస్తూంది.'

'నిజమేనండి.'

'బొత్తిగా కాలక్షేపం కావటంలేదోయ్—'

'అలా ఢిల్లివేపో బొంబాయివేపో...?'

'వొద్దువొద్దు శేషయ్యా! అలిసిపోయాను, అలాంటి ఎండమావుల్ని చూసి చూసి—'

'పోనీ ఆల్మోరావేపు వెళ్ళి ఇద్దరు ముగ్గురు నర్సుల్ని పెట్టుకుని...?'

'శేషయ్యా! ఆ చికిత్స ఇదివరకు అనేకసార్లు ప్రయత్నించి చూశాను. లాభంలేదు. ఆల్మోరామే వెళ్ళక్ఖర్లేదు. ఆ నర్సులు ఇక్కడికి రమ్మన్నా వొస్తారు. వాళ్ళ చేతివేళ్ళ తాకిడికి నయమయ్యే...ది కాదు మన పరిస్థితి...'

'పోనీ, భద్రాచలం అడవుల వేపు వెళ్ళి పులివేటలాంటి దేమైనా.?'

'వొద్దువొద్దు శేషయ్యా! అవన్నీ కోరలు తీసిన పులులు—నిజమైన పులులు-పులులలాంటి పులులు-ప్రపంచంలో ఎక్కడా లేనప్పుడు-ఇప్పటి కాలపు పులుల్ని చంపనక్ఖర్లేదు-అవి మనల్ని చంపలేవు—'

'ఇంక అయితే ఏంచేద్దామండీ?'

'అదే నేనూ ఆలోచిస్తూంట—'

'మీ పరిస్థితి బాగా మరమ్మత్తు కోరుతూందండి—మీరు విసిగిపోయారు—'

'అవును. విసిగిపోయాను - చూశాను-ఈ ప్రపంచాన్నీ, మనుషుల్నీ, దొరల్నీ, పులుల్నీ, నర్సుల్నీ...'

'ప్రభూ! మనస్సు మరింత హైరాన పెట్టుకోకండి-ఉద్రేకం మీకు మంచిది కాదు—'

'శేషయ్యా!'

'అయ్యా!'

'ఇరవై నాలుగ్గంటలలోగా—'

'చచ్చాను! ఏదో ఉపద్రవం తలపెడుతున్నారు.'

'విను శేషయ్యా!'

'వింటున్నానండి-ఖూనీ అవుతున్నానండి!'

'ఇరవై నాలుగ్గంటలలోగా-'

'ఏం జరుగుతుందండి ఇరవై నాలుగ్గంటలలోగా?'

'ఆ గడియారం ముల్లు ఇప్పుడున్న చోటునించి రెండుసార్లు తిరిగి అక్కడికే వస్తుంది-'

'ఇది గొప్ప సత్యమండి'

'శేషయ్యా!'

'ప్రభూ!'

'ఇరవై నాలుగ్గంటలలోగా ఆ గడియారం ముల్లు రెండుసార్లు తిరిగి మళ్ళీ అక్కడికే రావడానికి వీల్లేదు-'

'వీలుందండి-'

'వీల్లేదనీ చెబుతున్నా-నా సంస్థానంలో ఇలాంటి ఆటలు సాగవు-'

'ప్రభూ!

'ఎంతమాత్రమూ వీల్లేదు. ఉంటే ఉన్నచోటనే ఉండమను లేక పోతే ఛామ్మను. అంతేకాని, బయల్దేరిన చోటికే మళ్ళీ తిరిగి వచ్చే మాటైతే-శేషయ్యా-దాని గొంతుక నులిమేసి పారెయ్!'

## జహాంగీరు

'శేషయ్యా?'

'ప్రభూ! ఏమిటలా-?'

'నా ఆశలన్నీ భగ్నమైనాయోయ్-'

'చిత్తం! ఏం జరిగిందేమిటండి?'

'మన జహాంగీర్ విషయం-'

'............?'

'అదేనోయ్-మనం కొత్తగా కొన్న పంచకల్యాణి-'

'చిత్తం చిత్తం! భలేపేరు పెట్టారండి—ఇంతకీ ఏం జరిగిందేమిటి?'